# రాజారావు

మునిమాణిక్యం నరసింహారావు

★

రాజారావు భార్య చిన్నతనంలో ఎప్పుడో పోయింది. మళ్లీ వివాహం కాలేదు. ఇంకేం అవుతుంది! నలభైఏండ్లు వచ్చినవి!

అతడు ఎల్లాగ బ్రతుకుతున్నాడో ఎవ్వరికీ తెలియదు. ఉద్యోగం సద్యోగం లేదు. ఇల్లూ వాకిలీ లేదు. నా అన్నవారు లేరు. ఎక్కడో తినేవాడు. ఒక స్నేహితుని ఇంట్లో మటుకు అతనికో గది యిచ్చారు ఉంటానికి.

ఎప్పుడన్నా పత్రికలకు ఒక కథో వ్యాసమో వ్రాస్తాడు. దానివల్ల ఓ అయిదు రూపాయలు వస్తవి. ఆ అయిదు వచ్చిన రోజు సాయంత్రానికి కనపడవు. రేపు అనే రోజు ఎట్లాగ గడుస్తుంది అని అతను ఎప్పుడు ప్రశ్నించుకోలేదు.

ఒక పద్యమైనా వ్రాయలేదు అతడు. అయినా అతనిని అంతా కవి అని పిలుస్తారు. ఎవరైనా కాఫీహోటలుకు రమ్మంటే వెడతాడు. సిగరెట్టు ఇస్తే తాగుతాడు. అంతేకాని నాకు ఇది కావాలె ఇప్పించుమని అతడెవ్వరినీ అడగలేదు.

అతడు ఎప్పుడు ఖులాసాగా ఉంటాడు. చిరునవ్వు అతని పెదవులపైన ఎప్పుడూ నృత్యంచేస్తూ ఉంటుంది. అతడు అంత దారిద్ర్యం అనుభవిస్తూ కూడా సంతోషంగా ఉంటాడు. నవ్వుకుంటూ బ్రతుకుతాడు.

అన్నంతిన్న రోజునా నవ్వుతూ ఉంటాడు, తినని రోజునా నవ్వుతూనే ఉంటాడు.

మనిషైనవాడికి ఎన్నో విచారాలు ఉంటవి. బట్టలు లేవనీ, తిండి లేదనీ, ఉంటానికి ఇల్లు లేదనీ! ఇవన్నీ ఉంటే భార్యాపిల్లలు లేరని! వాళ్లుంటే ఉన్నారనీ, ఇల్లాగ మానవుణ్ని ఆశ్రయించుకొని ఎన్నో పిల్లదుఃఖాలు పెద్దదుఃఖాలు బ్రతుకుతున్నవి. ఈ మనిషికి ఏ దుఃఖమూ లేదు, విసుగు లేదు, చిరాకు లేదు.

ఒక్క చిరునవ్వు అనే ఖడ్గంతో, ఏ దుఃఖమూ తన దగ్గరకు రాకుండా కాపాడుకొంటున్నాడు.

జీవితాన్ని ఇంత ధైర్యంగా ఎదుర్కోగలిగిన ఈ వ్యక్తి, పెండ్లిచేసుకొంటే?

'భార్యా, పిల్లలు, సంసారం ఏర్పడ్డతరువాత ఇతని జీవితం ఇల్లాగ వెన్నెలరాత్రిలాగ ఉంటుందా, అప్పుడు తెలిసివస్తుంది జీవితం అంటే ఏమిటో. ఇప్పుడు ఒంటరిగాడు కాబట్టి ఏదో నెట్టుకొస్తున్నాడు.' ఇల్లాగ అనుకొన్నాము మేమంతాను.

ఈమధ్య రాజారావు రెండు సంవత్సరాల పాటు కనపడలేదు. ఎక్కడికి వెళ్ళిందీ ఎవ్వరికీ తెలియదు. యుద్ధంలోకి వెళ్లాడనీ, బహుళః వెళ్ళిపోయి ఉంటాడనీ అంతా అనుకొన్నారు.

ఉన్నట్లుండి ఒకరోజున హఠాత్తుగ ఊడిపడ్డాడు. బజార్లో దువ్వెనలూ సబ్బులూ వాసన నూనెలూ అల్లాంటి వస్తువులు అమ్మే షాపులో ఏవో కొంటూ ఉన్నాడు.

ఆ ముఖం ఎప్పటిలాగ కళకళలాడుతూ ఉంది. మళ్లీ నవ్వుతూ పలకరించాడు.

అతని ప్రక్కన ఓ ముసలమ్మ ఉంది!

రాజారావుకు తల్లి గాని, పెద్ద అక్కగారు గాని లేదు. ఆ విషయం మాకందరికీ తెలుసు.

ఆ ముసలమ్మ ప్రక్కన నుంచుని ఆవిడగారికి వాసననూనెలూ, సెంట్లుబుడ్లూ అవీ కొనిపెడుతున్నాడు. ఆ ముసలమ్మ ఎవరు అయి ఉంటుంది, మేమంతా ఆశ్చర్యపోయినాము.

'మీ పిన్నా?' అని అడిగాము. వాడు తల త్రిప్పి కాదని సూచించాడు.

'మీ అక్కగారా?

మళ్లీ తల త్రిప్పాడు.

ఆమె వీడికి బంధువు కాదన్నమాట!

అయితే ఎవరైనట్లు?

ఆమె వీడికి బంధువు కాదుగదా అన్నధైర్యంతో 'ఎవ్రరా ఈ ముసలది?' అన్నాము.

వాడు అన్నాడు — మీరు నన్ను క్షమించాలె. నేను మీకు చెప్పలేదు. నేను వివాహం చేసుకొన్నాను.

'అయితే అత్తగారా బాబూ?' అన్నాము.

'కాదు నా భార్య' అన్నాడు రాజారావు.

మాకు నిలువుగుడ్లు పడిపోయినయి. భార్య! ఇదేం భార్య! వీడా నలభై ఏండ్లలోపు-ఆమెకు 60 ఏండ్లు పైన! ఇదేం దాంపత్యంరా రామచంద్రా! అని మేము ఆశ్చర్యపడి నిశ్చేష్టులమై పోయినాము.

వాడు అన్నాడు 'ఏ భవనములో కురంగనయన అయిన గృహిణి కనబడదో ఆ భవనము సకల సంపత్తులతో కూడుకొన్నప్పటికీ వనమే అవుతున్నది కాని భవనము కావటములేదు. గృహానికి గృహలక్ష్మి ఉండాలె.'

నిజమే అనుకో, ఇదెక్కడి కురంగనయనరా నిన్ను తగలెయ్య!

ఆమెగారి రూపం చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది.

తల నెరిసి ఏకులబుట్ట అయింది!

మెడక్రింద చర్మం ముడుతలు పడ్డది!

చేతులూ కాళ్లూ ఎండిన కాష్ఠాకృతి!

పొట్ట బుగ్గలు!





బిటాలాక్స్

చాక్లెట్ భేది బిళ్లలు. సుఖవిరేచనము కలిగించి మలబద్ధమును పోగొట్టి మంచి జీర్ణశక్తినిచ్చును. వాడుకొనువిధము పొట్లములోనుండును. పొట్లం 2 బిళ్ళలు 1 అణా

అన్ని మందుల షాపులలోను లభ్యమగును.

Stockists :
Messrs, Dadna & Co., P. T., Madras.
Manufacturers :
**BOMBAY TABLET MFG. CO.**
P. O. Box No. 2092. BOMBAY. 2


పీక్కుపోయిన కళ్లు!

ఒంటిమీద ఒక నగ అయినా లేదు!

దేనికి ఆశపడి చేసుకొన్నట్లు!

వాడిని కొంచెం ఇవతలకు పిలిచి ఏమైనా మనస్సులో కష్టపడతాడేమోనన్న ఆలోచన అయినా లేకుండా అన్నాము 'ఏమోయ్ ఎక్కడ సంపాదించావు ఈ ముసలి తొక్కను!!'

ఈ మాటమీద వాడికి కోపం వస్తుందని భయం వేసింది.

రాజారావుకు కోపం రాలేదు.

నవ్వాడు.

ఇంకా ఏదో మాట్లాడాలనుకొన్నాము ఆమెను గురించి. వీడైతే నవ్వి ఊరుకొన్నాడు. ఆవిడ వింటే పోట్లాటకు రాదూ! అందుకని వాడికి మాత్రము వినపడేటంతటి తగ్గు గొంతుకతో ఏదో అనబోతుంటే వాడు మా మాటకు అడ్డొచ్చి అన్నాడూ 'ఫరవాలేదు పెద్దగా మాట్లాడు. ఆమెగారికి పుట్టెడంత చెవుడు! అరిచి చచ్చినా వినపడదు!'

ఈ ఆకారానికి తోడు అది కూడానా! అని నవ్వాము.

వాడు సంతోషంతో 'కళ్లు కూడా సరిగ్గా కనపడవు!' అని ఇంకొక విషయాన్ని కూడా బైటపెట్టాడు.

మేము ఆశ్చర్యపడి నుంచుంటే వాడు సంతోషంతో ఊగుతూ 'పళ్లు లేవు! అవి కట్టుడు పళ్ళు' అని పకపకా నవ్వాడు.

అంతటితో ఆ సుందరి సౌందర్యవర్ణన పూర్తి అయింది.

వాడికి విచారంలేదు. పైగా ఎంతో సంతోషిస్తున్నాడు.

మమ్మలను తీసుకొనివెళ్ళి, ఆమెకు ఎదురుగా నుంచోబెట్టి— వీరు మా స్నేహితులు అని పెద్దగా అరిచి చెప్పాడు.

ఆవిడ సంతోషించింది.

వాడు మాతో ఇల్లా అన్నాడు; 'ఇప్పుడు జీవితం, సుఖంగా ఉందోయ్......ఇన్నాళ్ళకు ప్రేమ అంటే ఏమిటో తెలిసింది.'

ఆ తరవాత రాజారావు, ప్రేమగా భార్య చెయ్యి పట్టుకొని బండిదగ్గరకు నడిపించుకు పోయినాడు.